
ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY

నల్లగొండ
5
శుక్రవారం 7 జూన్ 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.174	270	300
సూర్యాపేట	రూ.172	242	272
నల్లగొండ	రూ.172	240	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 23.4

మల్లన్నకు 18,565 ఓట్ల ఆధిక్యం

» మొదటి ప్రాధాన్యంలో ముందంజ » ద్వితీయ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి » మొదటి ప్రాధాన్యంలో ఎవరికీ రాని కోటా ఓటు

» ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ప్రారంభం » అశోక్‌కుమార్, ప్రేమేందర్‌రెడ్డి ఓట్లే కీలకం » నేటి రాత్రికి తుదిఫలితం వచ్చే అవకాశం


కౌంటింగ్ వివరాలు వెల్లడిస్తున్న ఆర్వో హరిచందన

నల్లగొండలో కొనసాగుతున్న కౌంటింగ్

నల్లగొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): శాసనమండలి నల్లగొండ-వరంగల్- ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపులో గురువారం రాత్రికి మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్‌కుమార్) 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ఆయనకు 1,22,813 మొదటి ప్రాధాన్య ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేశ్‌రెడ్డి 1,04,248 ఓట్లతో ద్వితీయ స్థానంలో ఉన్నారు. రాకేశ్‌రెడ్డి కంటే మల్లన్నకు 18,565 ఓట్ల ఆధిక్యత లభించింది. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి 43,313 మొదటి ప్రాధాన్య ఓట్లతో మూడోస్థానంలో ఉండగా, నల్లగొండకు చెందిన స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ 29,697మొదటి ప్రాధాన్య ఓట్లు సాధించి నాలుగోస్థానంలోకి వచ్చారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో గతానికి భిన్నంగా అత్యధికంగా 25,824 చెల్లనిఓట్లు ఉన్నాయి. మొత్తం చెల్లిన ఓట్ల ఆధారంగా 1,55,095 ఓట్లను కోటా ఓటుగా రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ప్రకటించారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో ఆధిక్యత సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కోటా ఓటు సాధించాలంటే ఆయనకి ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో 32,282 ఓట్లు రావాల్సి ఉంది. అదే రాకేష్‌రెడ్డి గెలవాలంటే 50,847 ఓట్లు రావాల్సి ఉంది. ఉప ఎన్నిక కౌంటింగ్ శుక్రవారం సాయంత్రానికి ముగిసే అవకాశం కనిపిస్తోంది.

నేటి రాత్రికి ఫలితం వచ్చే అవకాశం

ఉప ఎన్నికలో మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్న ఈ ఎన్నికలో నలుగురికి మినహా మిగిలిన అభ్యర్థులందరికీ అతి తక్కువ ఓట్లే వచ్చాయి. కొందరికి డబుల్ డిజిట్ ఓట్లే రావడం గమనార్హం. అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ మొదలుపెట్టి వారి ద్వితీయ ప్రాధాన్య ఓట్లను పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులకు కలుపుతూ వస్తారు. ఇలా ప్రధాన అభ్యర్థులు మినహా మిగిలిన 48 మంది అభ్యర్థుల ఓట్లు కలిపినా కోటా ఓటు వచ్చే అవకాశం ఉండదు. అయితే ఈ 48 మంది అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియ శుక్రవారం ఉదయం వరకు కొనసాగే పరిస్థితి ఉంది. ఇదే సమయంలో మూడో రౌండ్ ఓట్ల కౌంటింగ్‌పై తమకు అనుమానాలున్నాయని, మళ్లీ లెక్కించాలని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి డిమాండ్ చేయడంతో వాతావరణం వేడెక్కింది. ఎన్నికల సంఘం ఆయన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటుందా? లేదా? అనే అంశం తేలాల్సి ఉంది.

విజేతను తేల్చేది ఆ ఇద్దరి ద్వితీయ ప్రాధాన్య ఓట్లే

స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన నల్లగొండకు చెందిన పాలకూరి అశోక్‌కుమార్, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేట్ అయ్యాక, వారి బ్యాలెట్లలోని ద్వితీయ ప్రాధాన్య ఓట్లే విజేతను తేల్చే అవకాశముందని భావిస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన అశోక్‌కుమార్, 48 మంది స్వతంత్ర అభ్యర్థుల తర్వాత ఎలిమినేట్ అవుతారు. ఆయన ఓట్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎవరికి ఏ స్థాయిలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లు వస్తాయనే అంశం కీలకం కానుంది. అయితే కౌంటింగ్ సరళిని పరిశీలిస్తున్న రాజకీయనేతలు, పరిశీలకులు అశోక్‌కుమార్‌కు చెందిన బ్యాలెట్ల ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో కోటా ఓటు ఎవరికీ రాదని, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ తప్పదని భావిస్తున్నారు. ఆయన బ్యాలెట్ల ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక కోటా ఓటు రావచ్చని అంచనా వేస్తున్నారు. అయితే అప్పటికీ కోటా ఓటు రాకపోతే రెండో స్థానంలో ఉండే అభ్యర్థికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్య ఓట్లనూ లెక్కిస్తారు. అప్పటికీ కోటా ఓటు రాకపోతే తృతీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించాల్సి ఉంటుంది. గరిష్ఠంగా ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో ఫలితం తేలే అవకాశం ఉంది.

• అభ్యర్థులను చెమటలు పట్టించిన చెల్లని ఓట్లు

మొదటి ప్రాధాన్య ఓట్లలో చెల్లని ఓట్లు అత్యధికంగా నమోదవడం ప్రధాన పార్టీల అభ్యర్థులను చెమటలు పట్టిస్తున్నాయి. ఎన్నడూలేని రీతిలో పోలైన ఓట్లలో దాదాపు 8.50శాతం ఓట్లు చెల్లకుండా పోయాయి. మూడో రౌండ్ వరకే 23,784 ఓట్లు చెల్లకుండా పోగా, ప్రధాన అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగో రౌండ్ ముగిసే సరికి 25,824ఓట్లు చెల్లకుండా పోయాయి. ఎంతో అవగాహన ఉన్న గ్రాడ్యుయేట్ల ఓట్లే ఈ స్థాయిలో చెల్లకుండా పోవడమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాలెట్ పేపర్లపై అడ్డగోలు రాతలు, నినాదాలు, సంతకాలు, ఫోన్ నెంబర్లు, ప్రాధాన్య ఓటు ఇవ్వడంలో నిర్లక్ష్య వైఖరి తదితర కారణాలతో ఓట్లు చెల్లకుండా పోయాయి. చెల్లని ఓట్లు అధికంగా ఉండడం వల్లే మొదటి ప్రాధాన్య ఓట్లతో కోటా ఎవ్వరికీ రాలేదని, అనివార్యంగా ద్వితీయ ప్రాధాన్యానికి వెళ్లాల్సి వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అభ్యర్థుల సంఖ్య	52
మొత్తం ఓట్లు	4,63,839
పోలైన ఓట్లు	3,36,013
చెల్లిన ఓట్లు	3,10,189
కోటా ఓట్లు	1,55,095

అభ్యర్థి (పార్టీ)	మొదటి రౌండ్	రెండో రౌండ్	మూడో రౌండ్	నాలుగో రౌండ్	మొత్తం
తీన్మార్ మల్లన్న (కాంగ్రెస్)	36,210	34,574	35450	16,579	1,22,813
ఏనుగు రాకేష్‌రెడ్డి (బీఆర్ఎస్)	28,540	27,574	31242	16,892	1,04,248
గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి (బీజేపీ)	11,395	12,843	10278	8,797	43,313
పాలకూరి అశోక్ (స్వతంత్ర)	9,109	11,214	7170	2,204	29,697
చెల్లని ఓట్లు	7,728	7,398	8,658	2,040	25,824


శిథిలావస్థకు చేరిన చండూరు ఆరోగ్య కేంద్రం

ఆంధ్రజ్యోతి విజిట్

24 కాదు..
7 గంటలకే పరిమితం


● ఇద్దరు ఉండాల్సిన చోట ఒక్కరితో సేవలు ● స్టాఫ్‌నర్స్‌ల కొరత

● రాత్రి వేళ అందని వైద్యసేవలు ● మౌలిక వసతులు అంతంతే

పేదలకు అన్నిసమయాల్లో వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో 24గంటల ఆసుపత్రులను ప్రభుత్వాలు ఏర్పాటుచేశాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి ఆసుపత్రులు నిర్మించినా సరిపడా సిబ్బందిని నియమించకపోవడంతో సేవలు అందడంలేదు. వైద్యులు, స్టాఫ్‌నర్సు సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. వైద్యుడి సేవలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకే అందుతున్నాయి. స్టాఫ్‌నర్సు లేని సమయంలో ఏఎన్ఎంలతోనే సేవలు కొనసాగిస్తున్నారు. రాత్రి వేళ ఆసుపత్రులను మూసివేస్తున్నారు. దీంతో ఆసుపత్రుల ఏర్పాటు లక్ష్యం నీరుగారుతోంది. చండూరు, నిడమనూరు ఆసుపత్రులు శిథిలావస్థకు చేరుకున్నాయి. పైకప్పు పెచ్చులు ఊడిపోతుండటంతో రోగులతో పాటు సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. తిప్పర్తిలో వైద్యుడు గైర్హాజరవుతుండగా, కేతేపల్లిలో సిబ్బంది ఉన్నా రాత్రివేళ సేవలు కొనసాగడం లేదు.

వివరాలు 8లో

ఓటు బ్యాంక్ తారుమారు



లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో ఉమ్మడి జిల్లాలో ప్రధాన పార్టీల్లో ఆసక్తికర విశ్లేషణలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు ప్రధాన పార్టీల ఓట్లకు గణనీయమైన గండి పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ద్వితీయస్థానంలో కొనసాగిన బీఆర్ఎస్ ఎంపీ ఎన్నికలకు వచ్చేసరికి సగానికిపైగా ఓటు బ్యాంకును కోల్పోయింది. బీజేపీ ఓటు బ్యాంకు అనూహ్యంగా పెరిగింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు భారీగా మెజార్టీలు నమోదైనా, రెండు నియోజకవర్గాలు మినహా మిగిలిన 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓటింగ్ తగ్గింది.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

» గణనీయంగా తగ్గిన బీఆర్ఎస్ ఓట్లు » మెజార్టీలున్నా కాంగ్రెస్‌కూ తగ్గిన ఓట్లు

» బీజేపీనీ వెంటాడిన సమన్వయలోపం » మూడు పార్టీల్లోనూ భిన్నమైన విశ్లేషణలు

ఉమ్మడి జిల్లాలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్ నియోజకవర్గంతో పాటు ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సూర్యాపేట నియోజకవర్గంలో మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్ ఓటింగ్ తగ్గింది. ఈ తగ్గుదల కోదాడ, నల్లగొండల్లో స్వల్పంగా ఉండగా, మిగిలిన చోట్ల భారీగా ఉంది. నల్లగొండ లోక్‌సభ స్థానంలో అనూహ్యంగా ద్వితీయ స్థానంలోకి వచ్చిన బీజేపీకి ఆ పార్టీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి సొంత నియోజకవర్గం హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ కంటే తక్కువ ఓట్లు రాగా, సూర్యాపేట నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే తక్కువ ఓట్లు ఈ ఎన్నికల్లో నమోదయ్యాయి. ఇలా పలు భిన్నమైన ఫలితాలు ఈ ఎన్నికల్లో వెలువడడంతో భవిష్యత్ రాజకీయం ఎలా ఉండనుందనేది ఆసక్తికరంగా మారింది.

బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ తగ్గింది

ఉమ్మడి జిల్లాలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక అసెంబ్లీ స్థానాన్ని గెలవగా, మిగిలిన అన్ని చోట్లా ద్వితీయ స్థానంలో ఉంది. నల్లగొండ లోక్‌సభ పరిధిలో ఏడింట ఆరుచోట్ల ద్వితీయ స్థానంలో, సూర్యాపేటలో మొదటి స్థానంలో ఉన్న పార్టీ 33.13 శాతం ఓటు బ్యాంక్ సాధించింది. భువనగిరి లోక్‌సభ పరిధిలోని ఏడు సీట్లలోనూ ఆరింటిలో ద్వితీయ స్థానంలో ఉండి, 4,78,631 ఓట్లతో 36.39శాతం ఓట్ బ్యాంక్‌ను నిలబెట్టుకుంది. అయితే లోక్‌సభకు వచ్చేసరికి ఆ పార్టీ ఓట్ బ్యాంక్ పూర్తిగా పడిపోయింది. 2,18,417 ఓట్లతో 17.10శాతానికే పరిమితమైంది. భువనగిరి లోక్‌సభ స్థానంలో ఏడు నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో 5,60,002 ఓట్లతో 36.39శాతం ఓటింగ్‌ను సాధించగా, లోక్‌సభకు వచ్చేసరికి 2,56,187 ఓట్లతో 18.45శాతానికి ఓట్ బ్యాంక్ పడిపోయింది. బీఆర్ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసిన వర్గాల్లో యువత, విద్యార్థులతో పాటు, హిందూత్వ భావజాలం ఉన్నవారు, కుల ప్రాతిపదికన కొందరు ఓటర్లు బీజేపీకి మళ్లడంతో పాటు, బీఆర్ఎస్ తరుపున సాగిన ప్రచారం కూడా ఆకట్టుకోలేకపోవడం, అభ్యర్థుల ప్రాధాన్యం అంతగా కనిపించకపోవడం, పార్టీ శ్రేణులను ఏకతాటిపై నడపడంలో నాయకత్వం పట్టింపులేకుండా వ్యవహరించడం వంటి అంశాలు ఈ ఓట్ బ్యాంక్ తగ్గుదలకు కారణమయ్యాయని విశ్లేషకులు అంచనావేస్తున్నారు.

బీజేపీలో సమన్వయలోపం

ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ రెండో స్థానంలోకి దూసుకువచ్చింది. నల్లగొండ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల్లో 5.08శాతం ఓట్ బ్యాంక్ సాధిస్తే, ఎంపీ ఎన్నికల్లో 17.57శాతం ఓట్లు సాధించింది. బీఆర్ఎస్‌కంటే అరశాతం అధికంగా ఓట్లను రాబట్టింది. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప ఓట్లు వచ్చిన నల్లగొండ (7,828), మిర్యాలగూడ (3,024) స్థానాల్లో ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మించి ఓట్లు సాధించింది. నల్లగొండలో 51,451ఓట్లు వస్తే, మిర్యాలగూడలో 36,511ఓట్లు వచ్చాయి. సూర్యాపేటలో మాత్రం అసెంబ్లీ కంటే ఓట్లు తగ్గాయి. అసెంబ్లీ ఎన్నికల్లో 40,407 ఓట్లు వస్తే, ఎంపీ ఎన్నికల్లో 32,615 ఓట్లే వచ్చాయి. పార్టీకి బలమైన నాయకత్వం, మొదటి నుంచి ఓట్ బ్యాంక్ ఉన్న నియోజకవర్గమైనా, నాయకత్వానికి, అభ్యర్థికి మధ్య ఉన్న గ్యాపే ఓటింగ్ తగ్గుదలకు కారణంగా చెబుతున్నారు. అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌లో మాత్రం బీజేపీ మూడో స్థానంతోనే సరిపుచ్చుకుంది. ఇక్కడ బీఆర్ఎస్ రెండోస్థానంలో నిలిచి 27,781 ఓట్లు సాధిస్తే, బీజేపీకి 21,777 ఓట్లు వచ్చాయి. అభ్యర్థి, పార్టీ క్యాడర్, పాత, కొత్త నేతల మధ్య సమన్వయం కుదిరితే సూర్యాపట జిల్లాలోనూ మరిన్ని ఓట్లు పెరిగేవని, భువనగిరి తరహాలో అన్ని నియోజకవర్గాల్లో ద్వితీయ స్థానంలో ఉండేవాళ్లమని పార్టీ నేతలు చెబుతున్నారు.

రెండు చోట్ల మాత్రమే పెరిగిన కాంగ్రెస్ ఓటింగ్

అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లతో పోల్చుకుంటే, లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో హుజూర్‌నగర్, సూర్యాపేట మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓట్లకు గండి పడింది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో 1,16,707 ఓట్లు వస్తే, ఎంపీ ఎన్నికల్లో 1,33,200 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ కంటే 16,493 ఓట్లు అధికంగా వచ్చాయి. అదేవిధంగా సూర్యాపేట నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ద్వితీయ స్థానంతో సరిపుచ్చుకొని 70,537 ఓట్లకు పరిమితమైతే, ఈ ఎన్నికల్లో పార్టీ ఏకతాటిపై నడవడం, మాజీ మంత్రి దామోదర్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి వర్గవిభేదాలు వీడి పనిచేయడంతో ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కంటే ఆధిక్యత సాధించింది. దీంతో అసెంబ్లీ ఎన్నికల కంటే 32,736 ఓట్లు అదనంగా ఈ నియోజకవర్గంలో సాధించింది.

అధికారపార్టీకి 10చోట్ల తగ్గిన ఓటింగ్

నల్లగొండ లోక్‌సభ పరిధిలో 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గత శాసనసభ ఎన్నికల కంటే ఎంపీ ఎన్నికల్లో తక్కువ ఓట్లు వచ్చాయి. మిర్యాలగూడలో 14,972 ఓట్లు కాంగ్రెస్‌కు తగ్గాయి. నాగార్జునసాగర్‌లో 12,739 ఓట్లు, దేవరకొండలో 11,265 ఓట్లు, నల్లగొండలో 2,775 ఓట్లు, కోదాడలో 1,283 ఓట్లు అధికార పార్టీ అభ్యర్థికి తగ్గాయి. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో ఈ తగ్గుదల మరింత ఎక్కువగా కనిపించింది. ఆలేరు నియోజకవర్గంలో అసెంబ్లీ కంటే 45,410 ఓట్లు తగ్గాయి. నకిరేకల్ నియోజకవర్గంలో 36,626 ఓట్లు, తుంగతుర్తిలో 26,448 ఓట్లు, భువనగిరిలో 28,423 ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి తగ్గాయి. మునుగోడు అసెంబ్లీలోనూ 10,957 ఓట్ల తగ్గుదల కనిపించింది. భువనగిరి లోక్‌సభ పరిధిలోకి వచ్చే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 38,493 ఓట్లు తగ్గగా, జనగామలోనూ స్వల్పంగా 7,160 ఓట్లు తగ్గాయి. మొత్తంగా అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఊపు ఈ ఎన్నికలకు తగ్గిందని, ఇదే తగ్గుదల కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ప్రతిపక్షాలకు అవకాశమిచ్చినట్లు అవుతుందని, ఈ తగ్గుదలపైనా అధిష్ఠానం సమీక్ష నిర్వహించాలని అధికార పార్టీ నేతల్లో చర్చ సాగుతోంది. అయితే కాంగ్రెస్ వ్యతిరేక ఓట్లలో బీజేపీ, బీఆర్ఎస్‌కు చీలాయని, కాంగ్రెస్‌కు మంచి మెజార్టీ కనిపించినా, ప్రతిపక్షంగా ఒకే పార్టీకి ఓటర్లు మొగ్గితే మెజార్టీల్లోనూ గణనీయమైన తగ్గుదల కనిపించేదని, ఈ అంశాలను పార్టీ అగ్రనేతలు పరిశీలించాలని క్యాడర్‌లో చర్చ సాగుతోంది. మరి అధిష్ఠానం దీనిపై చర్చించి స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ ఓట్లు చీలకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సిందే.

చెర్వుగట్టుకు పోటెత్తిన భక్తులు

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం లోని చెర్వుగట్టు రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. గురువారం అమావాస్య రావడంతో శని జయంతి ఉండటంతో భక్తుల తాకిడి మరింత పెరిగింది.


6

పాఠశాలల్లో వెంటనే పనులు పూర్తిచేయాలి


వేములపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పనులను తనిఖీచేస్తున్న డీఈవో భిక్షపతి

డీఈవో భిక్షపతి

మాడ్గులపల్లి, వేములపల్లి, జూన్ 6: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని డీఈవో బొల్లారం భిక్షపతి అధికారులను ఆదేశించారు. గురువారం మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో, వేములపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పనులను తనిఖీచేసి మాట్లాడారు. విద్యుత్, మరుగుదొడ్ల మరమ్మతులు, తాగునీటి సౌకర్యం వంటి పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించి స్వయం సహాయక సంఘాల సహకారంతో ఉపాధ్యాయులు ప్రతిరోజు ఉదయం 7 నుంచి 11గంటలలోపు బడి ఈడు పిల్లలను గుర్తించాలన్నారు. పాఠశాలల్లో సౌకర్యాలను, ఇంగ్లీషు మీడియం విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా కృషి చేయాలన్నారు. పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసి సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు సాగుచేయాలని సూచించారు. పాఠశాలల పునఃప్రారంభం రోజు తోరణాలను కట్టి ఏపీసీ చైర్మన్, తల్లుల కమిటీ, గ్రామ పెద్దలను ఆహ్వానించి వారి ద్వారా ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలను, ఏకరూప దుస్తులను విద్యార్థులకు అందించాలన్నారు. ఆయన వెంట మాడ్గులపల్లి ఎంపీడీవో తిరుమలస్వామి, పంచాయతీ అధికారి సంగీత, ఎంఈవో బాలాజీనాయక్, గ్రామ కార్యదర్శి షకీరాబేగం, ప్రధానోపాధ్యాయులు నన్నూరి వెంకటరెడ్డి, వేములపల్లి ఎంఈవో బాలాజీనాయక్, ప్రధానోపాధ్యాయుడు బూరుగు రమేష్, వెంకటరెడ్డి, తదితరులు ఉన్నారు.

గ్రూప్-1 పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలి

అదనపు ఎస్పీ రాములునాయక్


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రాములునాయక్

నల్లగొండ టౌన్, జూన్ 6: జిల్లాలో ఈ నెల 9న గ్రూప్-1 పరీక్షను అధికారులంతా సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని నోడల్ ఆఫీసర్, అదనపు ఎస్పీ రాములునాయక్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 47 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 16,899 మంది అభ్యర్థులు గ్రూప్-1 ప్రిలిమనరీ పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్‌తో పాటు పటిష్ఠ భద్రత ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులు ఎలాంటి మొబైల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, క్యాలికులేటర్లు తీసుకెళ్లకూడదన్నారు. రైటింగ్ ప్యాడ్, బంగారు ఆభరణాలు ధరించి రావొద్దన్నారు.

అభ్యర్థులకు పరీక్ష కేంద్రంలో ఉదయం 9.30 గంటల నుంచి బయోమెట్రిక్ ప్రారంభం అవుతుందన్నారు. బయోమెట్రిక్ నమోదుకాని అభ్యర్థుల ఓఎంఆర్ ఆన్సర్ షీట్ మూల్యాంకనం ఉండదన్నారు. సమావేశంలో ఎస్బీ డీఎస్పీ రమేష్, రీజనల్ కోఆర్డినేటర్ ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.


చండూరులో రహదారిపై ప్రవహిస్తున్న వరద

నైరుతీరాగం

● జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు

● ఉరుములు, మెరుపులతో వాన

జిల్లాలో నైరుతి రుతుపవనాల రాకతో వర్షాలు కురుస్తున్నాయి. మూడు రోజులుగా వానల రాక కొనసాగుతోంది. ఉదయం భరించరాని ఉక్కపోతను చూపిస్తున్న వాతావరణం సాయంత్రానికి చల్లబడుతోంది. రాత్రి వేళ ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోంది. భూమి పదును తగ్గుతున్న తరుణంలో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచిన రైతులు ఇప్పటికే విత్తనాలు విత్తుతున్నారు. చండూరులో భారీ వర్షం కారణంగా రహదారులను వరద ముంచెత్తింది.

7


వైద్యులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


ఆస్పత్రిలో వివరాలు అడిగితెలుసుకుంటున్న మాతృనాయక్

జిల్లా ఆస్పత్రుల కోఆర్డినేటర్ మాతృనాయక్

దేవరకొండ, జూన్ 6: దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల కోఆర్డినేటర్ డాక్టర్ మాతృనాయక్ హెచ్చరించారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది, రోగుల వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ రాములునాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చూపుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయన్నారు. తీరు మార్చుకోకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రిలో 100 పడకలకు ఆక్సిజన్‌తో పాటు అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. అలాగే మందుల కొరత లేదని తెలిపారు. త్వరలో దేవరకొండ ఆస్పత్రిని 200 పడకలకు విస్తరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములునాయక్, డాక్టర్ రవి ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కళ్యాణ్‌చక్రవర్తి

గుర్రంపోడు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశమయ్యారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు భవాని చక్రవర్తి, సీహెచ్‌వో వెంకటరెడ్డి, పీహెచ్ఎన్ శారదకుమారి, సూపర్‌వైజర్లు సైదులు, ఉపేంద్ర, హెల్త్ అసిస్టెంట్లు జగదీష్, రాజబాబు, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టుకు పోటెత్తిన భక్తులు

- శనిజయంతి ప్రత్యేక అమావాస్యతో భారీగా రాక
- కొండపై నిద్రించిన భక్తులు

నార్కట్‌పల్లి, జూన్ 6: మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం రాత్రి లక్ష పుష్పార్చన ఉత్సవం వైభవంగా జరిగింది. అమావాస్య తిథి అందునా పదేళ్ల తర్వాత వచ్చిన శని జయంతి రోజే వచ్చిన ప్రత్యేక అమావాస్య కావడంతో చెర్వుగట్టు క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తొలుత ప్రధానాలయం నుంచి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను సన్నాయి వాయిద్యాలు, భక్తుల శివన్నామ స్మరణల మధ్య పల్లకిసేవతో మహా మంటపానికి చేర్చారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు పో తులపాటి రామలింగేశ్వరశర్మ, సహర్చక స్వాములు, వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య లక్ష పుష్పార్చన ఉత్సవం ఆద్యంతం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. పుష్పార్చన అనంతరం స్వామివారి చెంత పూజలందుకున్న పుష్పాలను తీసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. 40వేల మంది భక్తులు రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. కాగా ఆలయానికి వచ్చిన భక్తులు కొందరు కొండపై నిద్ర చేయగా మరికొందరు దర్శనం చేసుకుని వెళ్లారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. చెర్వుగట్టు క్షేత్రానికి విచ్చేసిన భక్తులకు ఎల్లారెడ్డిగూడెం ఆర్చి వద్ద ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య నిత్యాన్నదాన ట్రస్టు, వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో సత్రం చైర్మన్ రంగా శేఖర్, వైస్ చైర్మన్ మీలా సోమయ్య, ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.


చెర్వుగట్టుపై నిద్ర చేసేందుకు వచ్చిన భక్తులు


లక్ష పుష్పార్చన చేస్తున్న అర్చకులు

కారు వెనుక భాగంలో పాము

- భయభ్రాంతులకు గురైన యాత్రికులు

భువనగిరి రూరల్, జూన్ 6: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం అనంతారం గ్రామ శివారులోని స్వర్ణగిరి వేంకటేశ్వరుడిని దర్శించుకునేందుకు వచ్చిన సిద్ధిపేట భక్తులు గంట పాటు భయభ్రాంతులకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. సిద్ధిపేట మండలం సీతారాంపూర్‌కు చెందిన రవి కారులో అతని స్నేహితుడు సిద్ధిపేట జిల్లా దుద్దెడకు చెందిన జగదీష్ తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం స్వర్ణగిరి దేవాలయ సందర్శనకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో కారు ఎక్కుతుండగా, కింద భాగంలో నాగుపాము కనపడటంతో భయభ్రాంతులకు గురయ్యాడు. గమనించిన భక్తులు కారులో దూరిన పామును నెమ్మదిగా బయటకు తీసి అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు. ఈ ఘటనతో భక్తులు కొద్దిసేపు భయాందోళనకు గురయ్యారు.


కారులో దూరిన పాము

డివైడర్‌ను ఢీకొట్టి అదుపు తప్పిన కారు

- మరో కారును ఢీకొనడంతో ఇరువురికి గాయాలు

మిర్యాలగూడ అర్బన్, జూన్ 6: అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన కారు అవతలి వైపు రోడ్డులో వెళ్తున్న కారును ఢీకొట్టటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న పోట్ల రామారావు, తన సోదరుడు ప్రసాద్‌తో కలిసి కారులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గురజాలకు బయలుదేరారు. మార్గమధ్యంలో మిర్యాలగూడ పట్టణంలోని హనుమాపేట ఫ్లైఓవర్ వంతెన వద్దకు చేరుకోగా హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఎదురుగా వస్తున్న వీరి కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కార్ల ముందుభాగం పూర్తిదెబ్బతినగా, గురజాలకు వెళ్తున్న ప్రసాద్, రామారావు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును నడుపుతున్న మిర్యాలగూడ మండలం మొల్కలకాల్వకు చెందిన పొదిళ్ల వేణు సైతం స్వల్పంగా గాయపడ్డాడు. రెండు కార్లలో ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడు రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దొంగ అరెస్టు

మఠంపల్లి, జూన్ 6: తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను సూర్యాపేట జిల్లా మఠంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాదుకు చెందిన వనమాల సైదులు చెడు వ్యసనాలకు అలవాటు పడి భార్య, పిల్లలను వదిలి ఒంటరిగా ఉంటున్నాడు. కొన్ని రోజుల క్రితం మఠంపల్లికి వచ్చి ఓ గదిని అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. మఠంపల్లి మండలకేంద్రానికి చెందిన వెచ్చ చంద్రశేఖర్ ఏప్రిల్ 28వ తేదీన ఇంటికి, దుకాణానికి తాళాలు వేసి కుటుంబసభ్యులతో కలిసి ఒంగోలుకు వెళ్లాడు. గమనించిన సైదులు మే 1వ తేదీ రాత్రి ఇనుపరాడ్డుతో ఇంటి తాళాలు పగులగొట్టి పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న బంగార అభరణాలు, నగదు దొంగిలించి హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తులకు రూ. 2లక్షలకు కొంత బంగారాన్ని అమ్మాడు. అందులో రూ.30వేలు జల్సాలకు ఖర్చు చేసుకున్నాడు. మిగిలిఉన్న బంగారు అభరణాలను తీసుకెళ్లడానికి మఠంపల్లిలో తాను అద్దెకు ఉంటున్న ఇంటికి మంగళవారం వచ్చాడు. ఆభరణాలు తీసుకొని బుధవారం హైదరాబాదుకు వెళ్తుండగా మఠంపల్లి ఆటోస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమానాస్ప దంగా కన్పించాడు. సైదులును అదుపులోకి తీసుకొని విచారించారు. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అతనిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి తమదైన శైలిలో విచారణ నిర్వహించారు. తాను చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి నగదు రూ.లక్షా 70వేలు నగదు, కొన్ని బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.





గాలి వాన బీభత్సం

● ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల విరిగిన స్తంభాలు.. విద్యుత్ సరఫరాకు అంతరాయం ● చండూరు పట్టణం జలమయం



చండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిలిచిన వర్షపు నీరు



యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలో కురుస్తున్న వర్షం

యాదాద్రి, జూన్6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో గురువారం రాత్రి గాలి వాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులకు పలు గ్రామాల్లో చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేల కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో 46.0మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. యాదగిరిగుట్టలో 35.5మిల్లీమీటర్లు, వలిగొండలో 27.0 మిల్లీమీటర్లు, నారాయణపూర్‌లో 15.3మిల్లీమీటర్లు, గుండాలలో 1.5 మిల్లీమీటర్లు, మోత్కురులో 0.5మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాత్రి వేళలో ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో భక్తులు ఇబ్బందులు పడ్డారు.

మద్దిరాలలో మండలంలో ఐదు సెంటిమీటర్ల వర్షపాతం

మద్దిరాల: సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలో గాలి వాన బీభత్సం సృష్టించాయి. పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలో ఐదు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జి.కొత్తపల్లిలో రంగారావు ఇంటిపై చెట్టు పడడంతో రేకులు ధ్వంసమయ్యాయి.

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లిలో గురువారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారిపై వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

వలిగొండ: మండలంలో పలు గ్రామాలల్లో గురువారం మోస్తరు వర్షం కురిసింది. చల్లని గాలులతో ఉరుములు మెరపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం సాయంత్రం 20 నిమిషాలపాటు కురిసింది. దీంతో పాదచారులు, వాహనదారులు కొంతవరకు ఇబ్బందులకు గురయ్యారు.

పొంగిన వాగులు

చండూరు రూరల్: వర్షానికి మండలంలోని పడమటితాళ్ల, చామలపల్లి, తాస్కానిగూడెం గ్రామాల్లోని వాగులు పొంగి పొర్లుతున్నాయి. వర్షాకాలం రాకమునుపే తొలకరి పలకరింపుతోనే మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు పడమటితాళ్ల వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం నిండి పొంగి పొర్లుతుండటంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.


చండూరు: చండూరులో బుధవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి పట్టణం జలమయమైంది. కస్తూర్బాగాంధీ పాఠశాల ఎదుట ఉన్న పట్టణ ప్రధాన రహదారిపై నీరు ఎక్కువ లోతులో నిలిచిపోవడంతో వాహనదారులు ఇతర మార్గాల ద్వారా రాకపోకలు సాగించారు. ఇక్కడ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన డ్రైనేజీ పనులను కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశాడు. డ్రైనేజీలో నిలిచిన మురుగు నీరు ప్రధాన రహదారిపైకి రావడంతో వాహనదారులు, దుకాణదారులు, ఇబ్బంది పడ్డారు. రోడ్డు విస్తరణ పనులు పునః ప్రారంభించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని చండూరు మున్సిపాలిటీ చైర్మన్ తోకల చంద్రకళ వెంకన్న ఆరోపించారు. వర్షాకాలం ఆరంభంలోనే పట్టణమంతా జలదిగ్బంధమైందన్నారు.

వర్షం వస్తే చాలు రోడ్లన్నీ చిత్తడే

మర్రిగూడ: రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు శివన్నగూడెం నుంచి మేటిచందాపురం, ఇందుర్తి, కొట్టాల, నామాపురానికి వెళ్లే రోడ్లు నుంచి వాహనదారులు వెళ్లే పరిస్థితి లేదు. శివన్నగూడెం నుంచి నామాపురం వెళ్లే రోడ్డు వర్షాలకు రోడ్లు గుంతలమయంగా మారింది. ప్రయాణికులు, బాటసారులు, ద్విచక్రవాహనదారులు గుంతలలో పడి ప్రమాదానికి గురవుతున్నారు.



పడమటితాళ్లలోని వాగుపై నిర్మించి చెక్‌డ్యాం నిండి పొర్లుతున్న నీరు





మూడు రోజులుగా నీటిలోనే దేవాలయం



నీటిలో మునిగిన ఆంజనేయస్వామి దేవాలయం

నల్లగొండ రూరల్, జూన్ 6: నల్లగొండ పట్టణ పరిధిలోని పానగల్ సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయం, శివాలయం, మసీదు నీటిలో మునిగాయి. ఆంజనేయస్వామి దేవాలయంలో మూడు రోజులుగా దేవాలయంలోని గర్భగుడిలో సాగానికి పైగానీరు నిండి, దీపారాదన చేయడానికి కూడా వీలులేకుండా పోయింది. దేవాలయానికి వచ్చే భక్తులు నీటిలోనే ప్రదిక్షణలు చేస్తున్నారు. ఈ విషయాన్ని మునిసిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం ఉదయం మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ హమ్మద్ తదితరులు పంట పొలాలు, వరద నీటిని పరిశీలించారు. వరద ఒక్కసారిగా పొలాలపై ఎందుకు వచ్చిందో కారణాలు అడిగి తెలుసుకున్నారు. మసీదు కింది భాగంలోని కల్వర్టులో రైతులు వేసిన మట్టి తొలగించడంతో వరద నీరు ఒక్కసారిగా సమీపంలోని దేవాలయం మీదుగా రైతుల పంట పొలాల నుంచి స్థానికులు రైతులు పేర్కొంటున్నారు. రైతుల పొలాలతోపాటు, రోడ్డుపై పెద్దఎత్తున నీరు చేరడంతో నల్లగొండ నుంచి పానగల్ మీదుగా నకిరేకల్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవహించడంతో రోడ్డు కొట్టుకుపోయింది. ఈ వరద నీటితో రోడ్డు పక్కన ఉన్న ప్లాట్లు, పొలాలు కోతకు గురి కావడంతో తీవ్ర నష్టం కలుగుతుందని స్థానిక రైతులు అందోళన వక్తం చేస్తున్నారు. పై నుంచి వరదలు వరద కాల్వల గుండా వెళ్లకుండా కొంతమంది వరద కాల్వలను ఆక్రమించుకోవడంతో వరద నీరు పంట పొలాల మీదుగా పోతోందన్నారు. ఈ సమస్య ఇప్పటి కాదని, ప్రతి ఏడాది వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఉంటుందని స్థానికులు చెప్పారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని రైతులు, స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వరద నీరు పొలాలు, ప్లాట్లపై నుంచి నీరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



వరద నీరు వచ్చే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

వరద నీరు పొలాల నుంచి రాకుండా చర్యలు తీసుకుంటాం

పానగల్ గ్రామ సమీపంలో వరద కాల్వల ద్వారా నీరు వెళ్లకుండా కొంత మంది అడ్డు కట్ట వేస్తాం. అంతేకాకుండా పై భాగం నుంచి వరద నీటు కిందకు రాకుండా ఇరిగేషన్ అధికారులతో మాట్లాడాం. అదే విధంగా రోడ్డు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం చేపడతాం.

● సయ్యద్ ముసాబ్ హమ్మద్, మునిసిపల్ కమిషనర్

దేవాలయాలు నీటిలో మునిగినా పట్టించుకోవడం లేదు

దేవాలయానికి చుట్టుపక్కన కొందరు వరద నీటి కాల్వలను ఆక్రమించుకోవడంతో ఆ వరద నీరు దేవాలయంలోకి చేరుకుంటుంది. ఆంజనేయస్వామి దేవాలయంలో మూడు రోజులుగా దేవాలయం నీట మునిగి ఉంది. మునిసిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

● కట్ట వెంకట్‌రెడ్డి, పానగల్.







పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంకు ఎన్నికల షెడ్యూల్ విడుదల



పోచంపల్లి బ్యాంకు ఎన్నికల వివరాలు వెల్లడిస్తున్న శ్రీనివాస్

భూదాన్‌పోచంపల్లి, జూన్ 6: యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణంలోని ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు నూతన కార్యవర్గం ఎన్నికల నిర్వహణ షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి, డిప్యుటీ రిజిస్ట్రార్, ఆడిట్ ఆఫీసర్, డీసీబీ నల్లగొండ కార్యాలయం అధికారి జి శ్రీనివాస్ గురువారం విడుదల చేశారు. పోచంపల్లి బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు సీఈవో సీత శ్రీనివాస్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. 14న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పరిశీలన, ఈనెల 15న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా, గుర్తులను ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు వెల్లడిస్తామని తెలిపారు. ఈనెల 21న పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహించి విజేతలను ప్రకటిస్తామని తెలిపారు. పాలకవర్గం సభ్యులు (డైరెక్టర్) 9 స్థానాలు, అందులో ఎస్సీ/ఎస్టీ 1, మహిళల నుంచి 2, జనరల్ క్యాటగిరి నుంచి ఆరుగురు చొప్పున పోటీ చేయవచ్చని తెలిపారు. బ్యాంకు డైరెక్టర్ ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000, వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు రూ.2,000, ఇరత అభ్యర్థులకు రూ. 4,000 చొప్పున నామినేషన్ రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఓటు వేయు సభ్యుడు విధిగా తమ గుర్తింపు కార్డును వెంట తీసుకురావలెనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణాధికారి జి శ్రీనివాస్‌తోపాటు బ్యాంకు సీఈవో సీత శ్రీనివాస్, సీనియర్ మేనేజర్ రాచకొండ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలోని 24 గంటలు సేవలందించాల్సిన 17 ఆరోగ్య కేంద్రాలకు సుస్తీ చేసింది. సిబ్బంది, మందులు, మౌలిక వసతుల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇద్దరు వైద్యులు ఉండాల్సిన చోట ఒక్కరితోనే సేవలు కొనసాగిస్తున్నారు. కొన్నిచోట్ల నర్సులు, ఏఎన్ఎంలే సేవలు అందిస్తు న్నారు. రాత్రి వేళ ప్రజలకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా జిల్లా కేంద్రానికో, ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వ వైద్యసేవల కోసం వేచిచూసే పేదలకు వైద్యసేవలు ఆర్థికభారమవుతున్నాయి. కొన్నిచోట్ల అరకొర మందులతో నెట్టుకొస్తున్నారు. సిబ్బంది ఉన్నా రాత్రి వేళ సేవలకు నోచుకోనివి కొన్ని కాగా నిత్యం నెత్తురోడుతున్న రహదారుల సమీపంలో ఏర్పాటు చేసిన ఆసుపత్రుల్లోనూ సేవలు మృగ్యమయ్యాయి. వెరసి ఆసుపత్రుల తీరు పేరుగొప్ప ఊరు దిబ్బలా మారింది.

● పేరుకే 24 గంటల ఆసుపత్రులు ● వైద్యులు లేక అందని సేవలు ● ఒక్కవైద్యుడితోనే నెట్టుకొస్తున్న సిబ్బంది ● మందులు, సిబ్బంది కొరతతో రోగులకు అవస్థలు

డిండి : డిండి ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో సమస్యలు తిష్ఠ వేశాయి. జిల్లా సరిహద్దులో ఉన్న ఈ ఆసుపత్రి నిత్యం రోగులతో రద్దీగా ఉంటుంది. నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలోని 100 మంది వరకు నిత్యం అవుట్‌పేషంట్‌లు వస్తుంటారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని వంగూరు, ఉప్పునూతల, చారకొండ మండలాలతో పాటు డిండి ప్రజలు ఆసుపత్రికి వస్తుంటారు. ఇద్దరు వైద్యు లకు ఒక్కరే పనిచేస్తున్నారు. మరో డాక్టర్ నియామకం 20ఏళ్లుగా చేపట్టలేదు. దీంతో అత్యవసర సమయాల్లో ఆసుపత్రిలో వైద్యసేవలు అందడంలేదు. పూర్తిస్థాయిలో మందులు అందుబాటులోలేవు. ముగ్గురు స్టాఫ్‌నర్సుల పోస్టులతో పాటు మేల్, ఫిమేల్ సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాగునీటి సౌకర్యంలేదు. మరుగుదొడ్డిలో నీటి సరఫరా రావడంలేదు. అదేవిధంగా ఏళ్లతరబడి 108 వాహన సౌకర్యంలేదు. అత్యవసర పరిస్థితుల్లో 30 కిలోమీటర్ల దూరంలో నుంచి 108 వాహనం రావాల్సి ఉంటుంది. అంతలో క్షతగాత్రులు వైద్యసేవలు అందక మృత్యువాతపడుతున్నారు.

పెద్దఅడిశర్లపల్లి: పీఏపల్లి, గుడిపల్లిలలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ ఆసుపత్రుల్లో ఇద్దరు చొప్పున ఉండాల్సిన డాక్టర్లు ఒక్కరు చొప్పున సేవలు అందిస్తున్నారు. గుడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ తప్ప పూర్తిస్థాయిలో సిబ్బంది ఉంది. పీఏపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్సులు, మేల్, ఫీమెల్ సూపర్‌వైజర్ పోస్టులు, హెల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు ఆశావర్కర్ల కొరతతో వైద్యం అందక గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో తాగునీటి సౌకర్యం లేదు.

మునుగోడు : మునుగోడు ఆరోగ్యకేంద్ర వైద్యసిబ్బంది సమయపాలన పాటించటంలేదు. ముగ్గురు స్టాఫ్‌నర్సులకు ఒక్కరే ఉన్నారు. ఎంపీహెచ్ఎస్ సూపర్‌వైజర్, ఎల్‌డీ కంప్యూటర్ పోస్టులు ఖాళీగాఉన్నాయి. వివిధ కేటగిరిల్లోని సూపర్‌వైజర్లు విధులకు సక్రమంగా హాజరు కావటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆసుపత్రి మరుగుదొడ్డిలో నీటి సరఫరా లేదు.

శాలిగౌరారం : శాలిగౌరారం ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉన్న సిబ్బంది సకాలంలో రావడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఈ కేంద్రంలో ఇద్దరు వైద్యులకు ఒక్కరే ఉన్నారు. ఒక సూపర్‌వైజర్ పోస్టు ఖాళీగా ఉంది. నలుగురు స్టాఫ్‌నర్సులకు ఇద్దరే ఉన్నారు. 9మంది రెగ్యూలర్ ఏఎన్ఎంలకు ఒక్కరే పనిచేస్తున్నారు.

ఉన్న సిబ్బంది చుట్టపు చూపుగా, ఇష్టానుసారంగా వచ్చిపోతున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మర్రిగూడ : నాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరతతో వైద్యసేవలు అంతంతా మాత్రమే అందుతున్నాయి. ఇద్దరు వైద్యులు ఉన్నా ఏఎన్ఎంల కొరత తీవ్రంగా ఉండటంతో అత్యవసర వైద్యసేవలు అందక పలు ఇబ్బందులకు గురవుతున్నారు. సెకండ్ ఏఎన్ఎం పోస్టులు ఆరు ఖాళీగా ఉన్నాయి, స్టాఫ్ నర్సులు ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.

కనగల్: కనగల్ పీహెచ్‌సీలో సమస్యలు తిష్ఠ వేసుకున్నాయి. తాగునీటి సరఫరా, వాష్‌రూంలు వంటి కనీస వసతులు లేవు. ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. ప్రభుత్వం గతేడాది రూ 1.56 కోట్లతో ఆసుపత్రి కోసం నూతన భవన నిర్మాణం పనులను చేపట్టింది. అన్ని కుదిరితే ఆగస్టుకు భవనం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇదిలావుంటే ఆసుపత్రిలో కొన్ని రకాల మందులే అందుబాటులో ఉన్నయి. లేదు. అదేవిధంగా సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇద్దరికి ఒక్క మెడికల్ ఆఫీసర్‌తోనే వైద్యసేవలు కొనసాగుతున్నాయి. ల్యాబ్‌టెక్నీషియన్ ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్సు కొరత ఉందని డాక్టర్ వరూధిని తెలిపారు.

గుర్రంపోడు : గుర్రంపోడు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యుల్లో ఒకరిని డిప్యూటేషన్‌పై రాములబండ ఆరోగ్యకేంద్రానికి పంపించారు. డాక్టర్ సెలవులో ఉంటే కింది సిబ్బంది సేవలు అందిస్తున్నారు. స్టాఫ్‌నర్సులు ముగ్గురు ఉండగా ఇద్దరు విధులు నిర్వహిస్తున్నారు. ఒకరు గాంధీ ఆసుపత్రిలో ఎంఎస్ చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత కూడా వేధిస్తోంది. షుగర్, గ్యాస్, పేయిన్ కిల్లర్ వంటి మందులు తరచుగా లభ్యం కావడం లేదు.

చందంపేట: చందంపేట మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి 150మందికి పైగానే వస్తుంటారు. ఇద్దరు వైద్యులు 24 గంటలు వైద్యసేవలు అందించాల్సి ఉండగా ఒక వైద్యుడు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి మండల కేంద్రంగా రెండు మండలాలకు కలిపి ఒకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండడం, మారుమూల ప్రాంతం కావడంతో విధులు నిర్వహించేందుకు వైద్యులు ఆసక్తి చూపడంలేదు. దీంతో సరైనసమయంలో సేవలు అందడంలేదు.ఒక్క ఏఎన్ఎం, రెండు స్టాఫ్‌నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మారుమూల ప్రాంతాల నుంచి అత్యవసర వైద్యసేవల కోసం 50 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెల రోజులుగా వైద్యుడు డుమ్మా



తిప్పర్తి: తిప్పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సరైన వైద్యసేవలు అందడం లేదు. నెల రోజులుగా వైద్యుడు ఆసుపత్రికి హాజరు కాలేదని రోగులు ఆరోపిస్తున్నారు. మందులు ఇస్తున్నారని, నాడీ పట్టుకొని చూసే పరిస్థితి లేదని చెబుతున్నారు. కడుపునొప్పి వచ్చి ఎవరైనా ఆసుపత్రికి వెళితే కూడా సరైన వైద్యం అందడం లేదు. 108 వాహనానికి ఆసుపత్రి వారే ఫోన్ చేసి నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి పంపిస్తారు. ఓ శుభకార్యం నిమిత్తం నల్లగొండ మండలంలోని కేశరాజుపల్లి గ్రామస్థులు జంగారెడ్డి గూడెం గ్రామానికి వచ్చారు. కడుపునొప్పి రావడంతో తిప్పర్తి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఉన్న స్టాఫ్‌నర్సు కడుపునొప్పి సమస్య మాతో కాదని చెప్పడంతో వారు అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. ఇదిలా ఉంటే జ్వరం, దగ్గు, కడుపునొప్పి మినహాయిస్తే ఏ మందులు కూడా అందడం లేదని చెబుతున్నారు.

ప్రస్తుతం ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ ఎండీ అబ్దుల్ జమీర్ రాకపోగా మెడికల్ ఆఫీసర్‌గా ఉన్న ఎజాజ్ ఇక్తియర్ నెల రోజులుగా ఆసుపత్రికి రావడం లేదు. దీంతో రోగులకు వైద్యసేవలు పల్లె దవాఖానాల సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వంతులవారీగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

నెల రోజులుగా రావడం లేదు



తిప్పర్తి ఆరోగ్య కేంద్రానికి కొన్ని నెలలుగా వైద్యాధికారి రావడం లేదు. ప్రజలకు ప్రభుత్వ వైద్యసేవలు అందక ప్రైవేటు ఆసుపత్రిలకు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు చొరవ తీసుకొని 24 గంటలు వైద్య సేవలు అందేలా కృషి చేయాలి.

- వంగూరి రవి. తిప్పర్తి గ్రామ యువకుడు.

భయం భయంగా విధులు



శిథిలావస్థకు చేరిన చండూరు ఆసుపత్రి భవనం

చండూరు : ప్రభుత్వ ఆసుపత్రి శిథిలావస్థకు చేరింది. గోడలు, పైకప్పు పెచ్చులు ఊడుతూ ప్రమాదకరంగా మారింది. అడుగుభాగం కుంగిపోయి గుంతలమయమైంది. ఫర్నీచర్ కూడా పూర్తిగా తుప్పుపట్టి చెడిపోయిఉన్నాయి. వైద్యసిబ్బంది ఎప్పుడు ఏంజరుగుతుందోనని భయాందోళన మధ్య విధులు నిర్వహిస్తున్నారు. కొన్నేళ్లుగా మరమ్మతులు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేకుండాపోయాయి. చీకటిపడితే పాముల బెడద నెలకొంది. ఆసుపత్రి మరమ్మతుల కోసం గతేడాది కిందట రూ.68 లక్షలు మంజూరయ్యాయి. కానీ భవనాన్ని పరిశీలించిన జిల్లా స్థాయి ఇంజనీరింగ్ విభాగం, ఉన్నతాధికారులు, భవనము పూర్తిగా దెబ్బతిని ఉండడంతో మరమ్మతులు చేసినా ప్రయోజనం ఉండదని భావించి సుమారు రూ.కోటిన్నరతో కొత్త భవనాన్ని నిర్మించాలని అంచనాలు వేసినట్లు అధికారులు వెల్లడించారు. కొత్త భవనం నిర్మాణం పూర్తయ్యేలోగా ప్రస్తుత ఆసుపత్రి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఆసుపత్రిలో ఇద్దరు వైద్యులతో పాటు మరో 15మంది సిబ్బంది 24 గంటల వైద్య సేవలందిస్తున్నారు. ఆసుపత్రిలో డాక్టర్లతో పాటు ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా కేవలం ఒక్కరు మాత్రమే ఉన్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం

ఆసుపత్రి శిథిలావస్థకు చేరిన విషయం వాస్తవమే. పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. విధులు నిర్వహించాలంటే భయంగా ఉంది. మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. ఇంజనీరింగ్ విభాగం అధికారులు కొన్ని నెలల క్రితం ఆసుపత్రిని పరిశీలించారు. వారి నుంచి ఇంకా సమాచారం రావాల్సి ఉంది.

- మాస రాజు, వైద్యాధికారి, చండూరు

నిడమనూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత కారణంగా అరకొరగా వైద్యసేవలు అందుతున్నాయి. ఆరోగ్య కేంద్రంలో 30మంది సిబ్బంది ఉండాల్సి ఉన్నా కీలకమైన రెండు స్టాఫ్‌నర్స్ పోస్టులు, రెండో ఏఎన్ఎం పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. రోగులకు అవసరమైన మందులు కూడా అందుబాటులో లేవని ప్రజలు వాపోతున్నారు. కొన్ని రకాల మందులను ప్రైవేటు మందుల దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నామని రోగులు అంటున్నారు. 104 సిబ్బందికి ఏడు నెలలుగా వేతనాలు రావడం లేదు. ఆస్పత్రి బిల్డింగ్ పాతది కావడంతో పెచ్చులు ఊడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆస్పత్రికి వచ్చే ప్రజలతో పాటు సిబ్బంది కూడా ఆందోళనకు గురవుతున్నారు. నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి నూతన భవనాన్ని వేగవంతం పూర్తిచేయాల్సిన అవసరం ఉంది.



నిడమనూరు ఆసుపత్రిలో పెచ్చులూడుతున్న పైకప్పు

అందరూ ఉన్నా... అందని సేవలు

కేతేపల్లి : ప్రభుత్వం నుంచి సరిపడా మందులు అందుతున్నాయి. కేటాయించిన సంఖ్యలో సిబ్బందీ ఉన్నారు. అయినా కేతేపల్లి మండల ప్రజలకు 24గంటల వైద్యసేవలు అందని ద్రాక్షగానే మిగిలాయి. ఈ ఆసుపత్రికి 100కు పైగా ఓపీకి వస్తుంటారు. హైదరాబాద్‌-విజయవాడ జాతీయరహదారి(65వ)పై ఈ ఆసుపత్రి ఉండటంతో రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు సత్వరం వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని రెండేళ్ళ కిందట 24 గంటల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. ఇందుకోసం ఆసుపత్రికి ఇరువురు వైద్యులను కేటాయించగా రెండేళ్లుగా ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా మరో నియామకం జరగడం లేదు. వైద్యులు లేకుండా తాము విధుల్లో ఉండి మాత్రం ఏం చేస్తామంటూ కొన్నాళ్ళుగా సిబ్బంది సైతం రాత్రి విధులకు దూరంగా ఉంటున్నారు. రాత్రి వేళ వైద్యసేవలు అందుబాటులో లేకుండా పోతున్నాయి.



రాత్రిపూట తాళం వేసి ఉన్న కేతేపల్లి పీహెచ్‌సీ ఆరోగ్య కేంద్రం

అందుబాటులో పూర్తి స్థాయి సిబ్బంది

ఈ ఆసుపత్రిలో ఇరువురు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. స్టాఫ్ నర్సు పోస్టులు మూడు ఉండగా ముగ్గురు ఉన్నారు. ఏఎన్ఎంలు ఐదుగురు మేల్, ఏడుగురు ఫిమేల్ ఉన్నారు. అలాగే సెకండ్ ఏఎన్ఎంలు ఏడుగురు ఉన్నారు. ఇద్దరు మేల్,ఫిమేల్ సూపర్‌వైజర్లు ఉన్నారు.

అందుబాటులో లేని 108 వాహనం

జాతీయరహదారిపై ఉన్నప్పటికీ ఈ ఆసుపత్రికి 108 వాహన సౌకర్యం లేదు. దీంతో ఏదైనా ప్రమాదం జరిగినా, ఏగ్రామంలో ఎలాంటి వైద్యపరమైన అవసరం వచ్చినా 10కిలోమీటర్ల దూరంలోని నకిరేకల్ పట్టణం నుంచి కానీ 20 కిలోమీటర్ల దూరంలోని సూర్యాపేట పట్టణం నుంచి కానీ 108వాహనం రావాల్సి ఉంటుంది. 108సర్వీసు కోసం అనేక మంది విజ్ఞప్తి చేస్తున్నా అందుబాటులోకి రావడం లేదు.

● నిలిచిన కు.ని. శస్త్రచికిత్సలు



దామరచర్ల : దామరచర్లలోని ఆరోగ్య కేంద్రంలో కొన్ని నెలలుగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయడం లేదు.ప్రతి నెలా 30 మందికి పైగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం ఆసుపత్రికి వచ్చి వెళ్తున్నా ఉన్నతాధికారులు శిబిరం ఏర్పాటు చేయకపోవడంతో వారు విధిలేని పరిస్థితుల్లో రూ.వేలు ఖర్చు చేసి ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఈ కేం ద్రంలో కొంతకాలంగా సిబ్బంది కొరత వేధిస్తోంది. మూడు నర్సు పోస్టులకు ఒక్కరు మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో అత్యవసర సమయంలో స్టాఫ్‌నర్సులు చేయాల్సి డ్యూటీని ఏఎన్ఎంలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. తండాలు ఎక్కువగా ఉన్న మండలంలో వైద్యసేవల కోసం ప్రైవేట్‌కు వెళ్లి గిరిజనులు ఆర్థికంగా భారాన్ని మోస్తున్నారు.

నిత్యం రహదారులు రక్తమోడుతున్నా...

దేవరకొండ : చింతపల్లి మండలంలోని హైదరాబాద్-దేవరకొండ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ క్రమంలో 24 గంటల వైద్యం క్షతగాత్రులకు అందించాల్సిన చింతపల్లి ఆరోగ్య కేంద్రంలో వైద్యం సేవలు అందడం లేదు. దీంతో రోగులు దేవరకొండ, హైదరాబాద్‌కు వెళ్తున్నారు. అంబులెన్స్ అందుబాటులో లేక దేవరకొండ నుంచి 108 వాహనం రావాల్సిన పరిస్థితి. ఈ కేంద్రంలో మందులు కొరత నెలకొంది. ప్రైవేట్ మెడికల్ షాపులలో తెచ్చుకునే పరిస్థితి. మందులతో పాటు అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వేములపల్లి : నార్కట్‌పల్లి-అద్దంకి జాతీయరహదారిపై గల వేములపల్లి ఆరోగ్య కేంద్రంలో స్థానిక ప్రజలతో పాటు రహదారిపై ప్రయాణం చేసే పలువురు వైద్యసేవలు పొందుతుంటారు. ఇక్కడ ఉన్న ఇద్దరు వైద్యుల్లో ఒకరు డిప్యూటేషన్‌పై మిర్యాలగూడకు వెళ్లడంతో పాటు పూర్తిస్థాయిలో స్టాఫ్‌నర్సులు లేక పగటిపూట మాత్రమే వైద్యసేవలు అందుతున్నాయి. రాత్రి వేళ వైద్యసేవలు నిలిచిపోతున్నాయి. రహదారిపై ప్రమాదం జరిగితే నల్లగొండ, మిర్యాలగూడకు తీసుకెళ్లాల్సి వస్తుంది. ఒక స్టాఫ్‌నర్సుకు తోడు గతంలో ఎన్‌హెచ్ఎం ద్వారా ఇద్దరు స్టాఫ్‌నర్సులు ఉండేవారు. ప్రస్తుతం ఒక్కరే విధులు నిర్వహిస్తుండగా మరొక పోస్టు ఖాళీగా ఉంది.

అప్‌గ్రేడ్ చేసినా సిబ్బందిని నియమించలే..

హాలియా : హాలియా పట్టణంలోని 50పడకల ఆసుపత్రి ద్వారా ప్రభుత్వ వైద్యం పేదలకు అందని ద్రాక్షగా తయారైంది. పేరుకే 50 పడకల ఆస్పత్రి అయినా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగానే నిర్వహణ కొనసాగుతోంది. పేరుకే 24గంటల ఆసుపత్రి అయినా వైద్య సేవలు అందేది మాత్రం పగలు మాత్రమే. రాత్రి పనిచేయడానికి స్టాఫ్‌నర్సు సరిపోను లేకపోవడంతో రాత్రి ఆపద వస్తే ప్రైవేటు ఆస్పత్రినే వెళ్లాల్సిన పరిస్థితి. ఈ ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆస్పత్రిగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా సిబ్బందిని నియమించలేదు. హాలియా హాస్పటల్‌లో ఒక్క డాక్టర్ మాత్రమే విధులు నిర్వహిస్తుండగా మొదటి ఏఎన్ఎం పోస్టులు ఏడు ఖాళీలు ఉన్నాయి, హెల్త్ అసిస్టెంట్ పోస్టులు మూడు, సెకండ్ ఏఎన్ఎమ్ పోస్ట్ ఒకటి, థర్డ్ ఏఎన్ఎం పోస్టులు 10, స్టాఫ్‌నర్సు పోస్ట్ ఒకటి ఖాళీగా ఉంది. ఉన్న ఇద్దరు ఏఎన్ఎమ్‌లను నల్లగొండకు డిప్యూటేషన్‌పై పంపారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గౌతంరెడ్డి

మిర్యాలగూడ, దామరచర్ల, జూన్ 6: ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లు గౌతంరెడ్డి, సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్ అన్నారు. గురువారం మిర్యాలగూడ, దామరచర్లలో నిర్వహించిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఆశాలకు నష్టం కలిగించే పరీక్షను పెట్టే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. వారి సమస్యలపై ఈ నెల 13వ తేదీన కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాలో ఆశాలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఆయా సమావేశాల్లో సీఐటీయూ నాయకులు బంటు రా మారావు, ఆశా వర్కర్లు పద్మ, కవిత, రామలక్ష్మి, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, ఆశాలు జానకమ్మ, జయమ్మ, శారద, ఇందిరమ్మ, శ్రీదేవి, ఉమా, అచ్చాలమ్మ, శ్రీలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్వర్‌రావు ఆశయ సాధనకు కృషి చేయాలి

దేవరకొండ, నల్లగొండ రూరల్, జూన్ 6: భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, అమరజీవి చండ్ర రాజేశ్వర్‌రావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సహాయకార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ, దేవరకొండ పట్టణాల్లోని పార్టీ కార్యాలయాల్లో గురువారం రాజేశ్వర్‌రావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చండ్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలు నిర్వహిస్తూ 28 సంవత్సరాల పాటు సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శిగా పనిచేసి వేలాది ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత రాజేశ్వర్‌రావుకు దక్కిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో తెలంగాణ ప్రజా నాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, నాయకులు రామస్వామి, అంజనేయులు, పల్లా రంగారెడ్డి, జూలూరి వెంకట్రాములు, కిన్నెర యాదయ్య, కందుకూరు శ్రీను, వెంకటయ్య, పబ్బు వీరస్వామి లెనిన్ ముత్యాలు సుజాత మదర్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

దేవరకొండ, జూన్ 6: విద్యార్థులు, యువత ప్రతీ ఒక్కరు ఇంటి ఎదుట మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని గురువారం స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు తాళ్ల శ్రీధర్‌గౌడ్, కృష్ణకిషోర్, సముద్రాల వెంకన్న, వేణుగోపాలచారి, మహేష్ పాల్గొన్నారు.

విద్యను వ్యాపారంగా ప్రోత్సహించవద్దు

● జిల్లాలో బడిబాట కార్యక్రమాలు

నార్కట్‌పల్లి, మర్రిగూడ, మిర్యాలగూడ, తిరుమలగిరి(సాగర్), కనగల్, కొండమల్లేపల్లి, అడవిదేవులపల్లి, జూన్ 6: విద్యను వ్యాపారంగా ప్రోత్సహించవద్దని, అంగట్లో సరుకులా విద్యను అమ్మితే సమాజంలో విలువలు ఉండవని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. నార్కట్‌పల్లి జడ్పీ హైస్కూల్‌లో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాములు, ఉపాధ్యాయులు కవిత, సంధ్యారాణి, శ్యామల, శ్రీలత, లక్ష్మి పాల్గొన్నారు.

● నాంపల్లి మండలంలో బడిబాటను అమ్మ బడి ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మండల సమాఖ్య అధ్యక్షురాలు ఇందిర ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యునిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సంజీవరావు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలోని బకాల్‌వాడీ ఉన్నత పాఠశాల నిర్వహించిన సమావేశంలో హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబాటకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. బడిబాటలో భాగంగా బడి బయట ఉన్న బడిఈడు పిల్లల్ని బకాల్‌వాడీ పాఠశాలలో చేర్పించేందుకు ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి, నాగరాణిపాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) మండలంలోని చింతలపాలెం గ్రామంలోని బడిఈడు పిల్లందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని నాట్కో ట్రస్ట్ ప్రతినిధి జీఎల్ఎన్.రావు కోరారు. ఇంటింటికి వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కాశయ్య, టీచర్లు శైలజ, మంగ, పరమేష్, జ్యోతి, పావని, బాలకృష్ణ పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని కురంపల్లి, పగిడిమర్రి, పొనుగోడు, చినమాదారం, కనగల్, లచ్చుగూడెం తదితర గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం మురారిశెట్టి రమేష్, ఆదర్శ కమిటీ చైర్మన్ సోము సరిత, లక్ష్మణ్ కుమార్, ఉపాధ్యాయులు పుష్పలత, హైమావతి పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సముద్రాల శ్రీనయ్య, కొర్ర లోక్యనాయక్, సూర్యనాయక్, చంద్రయ్య, సీతారాం పాల్గొన్నారు.

● అడవిదేవులపల్లిలో ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య లభిస్తుందని జడ్పీ హైస్కూల్ హెచ్ఎం అబ్బాస్ అలీ అన్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, సోమలింగం, శ్రీను, సురేష్‌కుమార్, సహదేవ తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో గౌతమి సంచలన ఫలితాలు



అఖిల్‌వర్మ



అక్షిత

నల్లగొండ టౌన్, జూన్ 6: జాతీయ స్థాయి నీట్ ఫలితాల్లో నల్లగొండ పట్టణానికి చెందిన గౌతమి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. కళాశాలకు చెందిన వి.అఖిల్‌వర్మ 658, కె.అక్షిత 551, నిషాత్ ఫాతీమా 506, అబ్దుల్ రహమాన్ 511, ఫైజా అఫిషిన్ 501, ఎ.పూజిత 501, సౌజన్య 496, ఫహద్ 475, లక్ష్మీసుధ 467, డి.మౌనిక 462, ఎం.నవ్య 456, యాస్మిన్ 452, టి.సౌమ్య 450, మహ్మద్ ఉజైర్ 453, సీహెచ్. శ్రీజ 440, లుబ్‌నా అంజుమ్ 432, ఆర్. నిత్యశ్రీ 430, శోభిత 417 వంటి అత్యుత్తమ మార్కులతో గౌతమి విద్యా సంస్థలను నెంబర్ వన్ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను, అధ్యాపకులను గౌతమి విద్యాసంస్థల డైరెక్టర్లు కాసర్ల వెంకట్‌రెడ్డి, చల్లా వెంకటరమణ, కొమ్మిడి రఘుపాల్‌రెడ్డి, పుట్ట వెంకటరమణారెడ్డి అభినందించారు.

నేడు కేతేపల్లి మండల సభ

కేతేపల్లి, జూన్ 6: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పి.శేఖర్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు హాజరై గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై చర్చించాలని అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు తమతమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతి నివేదికలతో సమావేశానికి సకాలంలో హాజరుకావాలని ఆయన సూచించారు.

సంక్షిప్త సమాచారం...

మిర్యాలగూడ అర్బన్: కోదాడ- జడ్చర్ల జాతీయరహదారి విస్తరణ పనుల్లో భాగంగా రహదారి వెంట ఉన్న 11కేవీ విద్యుత్ లైన్ షిఫ్టింగ్ చేయాల్సి వస్తున్న నేపథ్యంలో నేడు టూటౌన్ పరిధిలోని ఎఫ్‌సీఐ, ప్రకాష్‌నగర్, బాపూజీనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు.

నార్కట్‌పల్లి: మండలంలోని గోపలాయపల్లి గుట్టపై వేంచేసి ఉన్న వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో గురువారం సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతీ నెలా రోహిణి నక్షత్రం రోజున గుట్టపై సుదర్శన హోమాన్ని ఆచరిస్తున్నారు. యాజ్ఞీకులు వంశీ కృష్ణమాచార్యులు సహర్చకులతో జరిగిన ఈ ఉత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని తక్కెళ్లపహాడ్ గ్రామంలో మృతిచెందిన నిరుపేద చెరుకు సోమమ్మ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నాయకుడు కట్టంగూరి మహేందర్‌రెడ్డి, కట్టంగూరి సురేందర్‌రెడ్డి రూ.5,116లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తీరుపారి మల్లయ్య, వజ్జె బిక్షమయ్య, చెరుకు జానయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ, చండూరు: ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్‌రెడ్డి, చండూరు మండలంలోని చామలపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నేర్లకంటి రవికుమార్ అన్నారు. కోరారు. గతంలో సరైన నాయకుడు లేకపోవడం వల్ల అభివృద్ధికి నోచుకోలేదని కోమటిరెడ్డికి మంత్రి పదవి ఇస్తేనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు.

నార్కట్‌పల్లి: అతివేగంగా వెళ్తూ ప్రమాదానికి కారణమవుతున్న టిప్పర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మండలంలోని గోపలాయపల్లికి చెందిన అల్లె పరమేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన జిల్లా రవాణాధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో మట్టిని తరలిస్తూ టిప్పర్లు గ్రామాల్లో అతి వేగంగా నడుపుతున్నారని అన్నారు. దీంతో ప్రమాదాలకు కారణమవుతున్నారని పేర్కొన్నారు.

మునుగోడురూరల్: మునుగోడు మండలం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఈర్ల లింగస్వామియాదవ్‌ను నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్నగౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నల్లగొండలో లింగస్వామియాదవ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లింగస్వామిమాదవ్ మాట్లాడుతూ సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానని అన్నారు.

నార్కట్‌పల్లి: మండలంలోని శాపల్లి మాజీ సర్పంచ్ సిద్దగోని స్వామి గౌడ్‌కు మాతృవియోగం కలిగింది. అతని తల్లి లింగమ్మ బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు పుల్లెంల అచ్చాలు, దూదిమెట్ల సత్తయ్య లింగమ్మ మృతదేహంపై పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

చిట్యాల: రోటరీక్లబ్ ఆఫ్ చిట్యాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ అధ్యక్షుడు గుండెబోయిన సైదులు కోరారు. చిట్యాల క్లబ్ ఆధ్వర్యంలో న్యూ క్లబ్ డెవలప్‌మెంట్ జోన్ చైర్మన్ ఎంపల్ల బుచ్చిరెడ్డి సహకారంతో పీహెచ్‌సీకి వీల్‌చైర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో చిట్యాలలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎడ్ల శ్రీశైలం, నర్సింహ, గాలి యాదగిరి, రవీందర్‌రెడ్డి, శివసాయి, వైద్యాధికారి అజహర్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: మహిళా చైతన్యంతో క్లబ్ సేవలు విస్తృత పరుస్తున్నామని వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి పీఆర్వో రాయపుడి భవాని అన్నారు. వాసవీ, వనిత, కుసుమాంబ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ బస్టాండులో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు చైతన్యంతో క్లబ్ శాఖలు, సభ్యులు పెరుగుతుండటం ఆహ్వానించదగిన పరిణామమన్నారు. కార్యక్రమంలో సభ్యులు తిరునగరు పద్మ, గుండా లక్ష్మి, కొండూరు ఇందిర, వీరవెల్లి శ్రీదేవి, జయిని సుస్మిత, ఓరుగంటి జ్యోతి, కొప్పురావూరి రమాదేవి, జ్యోతి, అనూష, నాగజ్యోతి, లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం: మండలంలోని దుగ్గేపల్లి పంచాయతీ పరిధిలోని దుర్గానగర్ గ్రామంలో ఇటీవల వీచిన ఈదురుగాలులకు రెండు కోళ్లఫారాలు నేలమట్టమయ్యాయి. విషయం తెలుసుకున్న మాజీమంత్రి జానారెడ్డి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బాధితులను పరామర్శించారు. వీరమళ్ల జ్యోతి కుటుంబాన్ని పరామర్శించి, బాధితులకు ప్రభుత్వంపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే మండలంలోని కొణతాలపల్లి గ్రామ పంచాయతీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతాప్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహానికి జానారెడ్డి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముడిమల్ల బుచ్చిరెడ్డి, ఎంపీపీ సలహాదారుడు అనుముల పాండమ్మశ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్టు రవికుమార్ పాల్గొన్నారు.

గుర్రంపోడు: సేంద్రీయ వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని గోఆధారిత వ్యవసాయం, ఎరువుల నిపుణుడు రంజాన్ రమేష్ అన్నారు. గుర్రంపోడు రైతుల ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మండలంలోని పోచంపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విషతుల్యం కాని భూమిని భావితరాలకు అందించాలన్నారు. గోఆధారిత వ్యవసాయంతో అధిక దిగుబడితో పాటు ప్రజలు ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. కార్యక్రమంలో గుర్రంపోడు ఎఫ్‌పీవో చైర్మన్ కట్టెబోయిన వెంకటేశ్వర్లు, రైతులు కురుమారెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ అన్నారు. ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేటు పెంచేందుకు ప్రవేశపెట్టిన గిఫ్ట్ పథకానికి ఎంపికైన ప్రయాణికులకు గురువారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం నుంచి విజయవాడకు డీలక్స్ బస్‌లో ప్రయాణించే మహిళలకు లక్కీ డ్రా స్కీంను ప్రవేశపెట్టామని తెలిపారు. డ్రా ద్వారా ప్రయాణికులను ఎంపిక చేసి బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు భారతీబాయి, యాదగిరి సంపత్, సాయి పాల్గొన్నారు.